క్లుప్తంగా

ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలి



వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న పావని

మునగపాక: ప్రతి ఒక్కరూ కలియుగ దైవం శ్రీనివాసుని ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలని వేంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ కోరారు. మునగపాకలో రూ.5 కోట్లతో నిర్మిస్తున్న వేంకటేశ్వర స్వామి ఆలయానికి విరాళాలు అందించాలన్నారు. ఆదివారం మునగపాకకు చెందిన దొడ్డి నాగరాజు, పావని దంపతులు రూ.7,777 విరాళంగా అందజేశారు. మునగపాకకు చెందిన పెంటకోట దేవన్‌రాజు, సూర్యం దంపతులు రూ.10 వేల విరాళం అందించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఆడారి అచ్చియ్యనాయుడు, ఆడారి కాశీబాబు, పొలిమేర కృష్ణ, వెలగా శ్రీనివాసరావు, ఆడారి రమణబాబు, పెంటకోట శ్రీను(నెట్), ఆడారి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామరక్ష రథానికి ఘన స్వాగతం



మహిళల కోలాటం

అచ్యుతాపురం రూరల్: శ్రీరామరక్ష రథానికి అచ్యుతాపురంతో పాటు పూడిమడక, దుప్పితూరు, కుమారపురం, కోనెంపాలెం, భోగాపురం, మోసయ్యపేట, చోడపల్లి గ్రామాల్లో భక్తులు ఘన స్వాగతం పలికారు. తొలుత శ్రీరామరక్ష రథానికి మహిళలు మంగళ హారతులు ఇవ్వగా, దారిపొడవునా కోలాటాలు, భజనలు, కీర్తనల మధ్య ఊరేగింపు సాగింది. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్‌రాం విగ్రహావిష్కరణ



విగ్రహావిష్కరణలో పాల్గొన్న డీబీఏఎస్ఎస్ నాయకులు, స్థానికులు

కోటవురట్ల: బాబూ జగ్జీవన్‌రాం యువత ఆధ్వర్యంలో కె.వెంకటాపురంలో డాక్టరు బాబూ జగ్జీవన్‌రాం విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి దళిత బహుజన ఆదరణ సేవా సమితి సభ్యుడు పెదపూడి శ్రీను అధ్యక్షత వహించగా, ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు కొల్లి చిన్నఅప్పారావు మాట్లాడారు. బాబూ జగ్జీవన్‌రాం అసమానతలు రూపుమాపేందుకు ఎంతగానో కృషి చేశారన్నారు. ఎమ్మార్పీఎస్ ప్రధాన కార్యదర్శి కనకేశ్వరరావు, సభ్యులు మంజేటి రాజు, ఎత్తుల అప్పారావు, గంపల చినరాజు, ఏడిద సురేష్, లోవరాజు, శ్రీరామ్మూర్తి, గ్రామస్తులు పాల్గొన్నారు.

హైవేపై డ్రోన్‌తో నిఘా



డ్రోన్ కెమెరా ద్వారా జాతీయ రహదారిని గుర్తించిన పోలీసులు

పాయకరావుపేట: పట్టణ పరిధిలో జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్యను డ్రోన్ కెమెరాతో నిఘా పెట్టినట్టు సీఐ జి.అప్పన్న తెలిపారు. పీఎల్‌పురం, దొరనగర్, సీతారాంపురం గ్రామాల పరిధిలోని అసాంఘిక కార్యకలాపాలను పరిశీలించడం జరుగుతుందన్నారు.

పార్కు నిర్మాణ పనుల్లో నాణ్యతా లోపం

విచారణకు సీపీఎం నేత వెంకన్న డిమాండ్



దేవరాపల్లి: స్థానికంగా వీఎంఆర్డీఏ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పార్కు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు లోపించాయని, సమగ్ర విచారణ జరపాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి. వెంకన్న డిమాండ్ చేశారు. పనుల్లో నాణ్యత పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో అన్నారు. ఈ పనుల్లో నిధులు దుర్వినియోగం అవుతున్నాయని ఆరోపించారు. ప్రస్తుతం రూ. 22 లక్షలతో ట్రాక్ నిర్మాణ పనులు చేస్తున్నారని, కింద నేల చదును చేయకుండా, రోలింగ్ చేపట్టకుండా తూతూ మంత్రంగా పనులు చేపడుతున్నారని విమర్శించారు. నాణ్యతా లోపం కారణంగా సీసీ ట్రాక్ తక్కువ రోజుల్లో పగుళ్లు వచ్చే ప్రమాదం పొంచి ఉందన్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి పక్కాగా పనులు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

మెట్ట భూముల్లో సిరుల పంటలు



కోతకు సిద్ధంగా ఉన్న బొప్పాయి

- లాభసాటిగా బొప్పాయి
- ఎకరాకు సగటున లక్ష ఆదాయం
- పోడు భూముల్లో జీడి, మామిడి
- టమాటా పంటకు గిరాకీ

నక్కపల్లి: నవ్విన నాప చేనే పండిందన్న సామెతను రుజువు చేస్తున్నారు మెట్ట ప్రాంత రైతులు. అన్నదాతలు తలచుకుంటే సాధించలేనిది ఏదీ లేదంటూ బీడు భూముల్లో బొప్పాయి సిరులు పండిస్తున్నారు. మండలంలో మెరక గ్రామాల్లో ఇటీవల కాలంలో ఉద్యాన వన పంటలపై ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలార్జిస్తున్నారు. నిత్యం ఏదోఒక పంట వేస్తూ కాయం కష్టం చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. గతంలో మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో పేదలకు పంపిణీ చేసిన పోడు భూముల్లో సైతం ఉద్యానవన పంటలైన మామిడి, జీడి, బొప్పాయి, జామ సాగు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. 20 నుంచి 30 ఏళ్ల వయసు కలిగిన మామిడి, జీడి తోటలను తొలగించి బొప్పాయి, టమాటా పంటలు వేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో బొప్పాయికి గిరాకీ ఎక్కువగా ఉండటంతో నక్కపల్లి మండలంలో మెరక గ్రామాల రైతులు ఈ సాగుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు.

ఈ గ్రామాల్లోనే ఉద్యానవన పంటలపై ఆసక్తి

దొంకాడ, సీతానగరం, దోసలపాడు, చీడిక, కొత్తూరు, రేబాక, రమణయ్య పేట, ముకుందరాజుపేట, గుల్లిపాడు, చినదొడ్డిగల్లు, పెద దొడ్డిగల్లు, సీతంపాలెం తదితర గ్రామాల్లో రైతులు ఉద్యానవన పంటలపైనే ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. ఈ గ్రామాల పరిధితో నీటి సదుపాయం అందుబాటులో ఉంది. సమీపంలో చీడిక రిజర్వాయర్ ఉండటంతో నీటి కొరత లేదు. పోలవరం కాలువకు ఎగువన ఉన్న ఈ గ్రామాల్లో బీడు, పోడు భూముల్లో నాలుగైదు సంవత్సరాలుగా ఉద్యానవన పంటలను ఎక్కువగా వేసి డ్రిప్ ఇరిగేషన్ ద్వారా సాగు చేస్తున్నారు. సుమారు 300 ఎకరాల్లో బొప్పాయి, 20 ఎకరాల్లో జామ, 200 ఎకరాల్లో టమాటా, 100 ఎకరాల్లో కూరగాయలను పండిస్తున్నారు. ఇవే కాకుండా కొండ పోరంబోకు భూముల్లో ప్రభుత్వం నుంచి డీఫారం పట్టాలు పొందిన రైతులు మామిడి, జీడి సాగు చేస్తున్నారు. 500 ఎకరాల్లో జీడి, మామిడి సాగవుతోంది.



దొంకాడ పరిధి మెట్ట భూముల్లో బొప్పాయి సాగు

బొప్పాయి టన్ను రూ.18 వేలు

నిత్య పంటగా ఉన్న బొప్పాయి ప్రస్తుతం డిమాండ్ ఎక్కువగా ఉంది. ఆరు మాసాలకు ఒకసారి దిగుబడి వచ్చే బొప్పాయి సాగుపై ఎక్కువ మంది రైతులు మొగ్గు చూపుతున్నారు. ఎకరా విస్తీర్ణంలో 800 నుంచి వెయ్యి మొక్కలు నాటుతారు. ఈ మొక్కలు మహారాష్ట్ర నుంచి దిగుమతి చేసుకుంటారు. మొక్క ఖరీదు ఒక్కొక్కటి రూ.15 నుంచి రూ.20 ఉంటుంది. ఎకరాకు 25 నుంచి 30 టన్నుల దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. మహారాష్ట్ర మొక్కలయితే ఎటువంటి తెగుళ్లు ఉండవని చెబుతున్నారు. నెలకు రూ.1.20 లక్షల ఆదాయం వస్తోందని చెబుతున్నారు. ఈ ప్రాంతంలో పండించిన బొప్పాయిని కాకినాడ, విశాఖపట్నం, రాజమండ్రి ఎగుమతి చేస్తుంటారు. డ్రిప్ సదుపాయం ఉండటంతో నీటి సమస్య పెద్దగా ఉండటం లేదని, దిగుబడి బాగానే వస్తోందని రైతులు చెబుతున్నారు. డిమాండ్ ఎక్కువగా ఉన్న రోజుల్లో బొప్పాయి టన్ను రూ.25 వేలు పలుకుతుందని, ప్రస్తుతం రూ.18 వేలు మాత్రమే ఉందని రైతులు చెబుతున్నారు.

కూరగాయల పంటలతో జీవనోపాధి

ఇవే కాకుండా ఆనప, బీర, కాకర, బెండ, వంకాయ, వంటి కూరగాయల పంటలను వేసి జీవనోపాధి పొందుతున్నారు. గతంలో ప్రభుత్వాలు సూక్ష్మ సేద్యానికి 90 శాతం సబ్సిడీ ఇవ్వడంతో మెట్ట ప్రాంత రైతులు డ్రిప్ ఇరిగేషన్ వేయించుకున్నారు. లక్ష రూపాయలు ఖర్చయ్యే డ్రిప్‌కు రైతు రూ.10 వేలు చెల్లిస్తే డ్రిప్ పరికరాలు ఏర్పాటు చేసేవారు. బోరు నిర్మాణానికి అయ్యే ఖర్చును రైతులు భరించాల్సి వస్తుంది. అదేవిధంగా గత జగనన్న ప్రభుత్వంలో జలసిరి కింద బోర్లను సైతం ఉచితంగా తవ్వించారు. ఈ సదుపాయాలన్నింటిని ఉపయోగించుకుని మెట్ట ప్రాంత రైతులు ఉద్యానవన, కూరగాయల సాగుపై దృష్టి కేంద్రీకరించారు. వైఎస్సార్ హయాంలో నిర్మించిన పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులు పాయకరావుపేట నుంచి ఎలమంచిలి వరకు దాదాపు 50 శాతం పూర్తయ్యాయి. కాలువలో నీరు పుష్కలంగా చేరింది. వర్షాలు పడిన సమయంలో వర్షపు నీరంతా పోలవరం కాలువలో చేరడంతో ఏడాది పొడవునా కాలువకు ఎగువ దిగువ ప్రాంతాల్లో ఉన్న భూములకు పుష్కలంగా నీరు అందుబాటులో ఉంటోంది. ఈ కాలువలో నీటిని మోటార్ల సాయంతో ఉపయోగించుకుని రైతులు అన్ని రకాల పంటలను సాగు చేస్తున్నారు.



మెట్టభూములకు నీటి సదుపాయం కల్పిస్తున్న చీడిక రిజర్వాయర్

లాభసాటిగా బొప్పాయి సాగు



ఇటీవల కాలంలో బొప్పాయి సాగు లాభసాటిగా ఉంది. డ్రిప్ ద్వారా బొప్పాయి సాగు చేస్తే ఆశించిన లాభాలు వస్తున్నాయి. ఇది నిత్యపంటగా ఉంది. ఆరు మాసాల కొకసారి దిగుబడి వస్తోంది. పెట్టుబడులు పోను ఎకరాకు రూ.లక్ష రూపాయల ఆదాయం లభిస్తోంది. తెగుళ్ల సోకకుండా సస్యసరక్షణ చర్యలు నీటి సదుపాయం ఉంటే మంచి లాభాలు వస్తున్నాయి. టమాటా కూడా బాగానే కలిసొస్తుంది. మెరక గ్రామాల్లో చాలామంది రైతులు ముదర మామిడి తోటలను తొలగించి బొప్పాయి, టమాటా, కూరగాయల పంటలు వేస్తున్నారు. మామిడి, జీడి దిగుబడులు ఆశించినంతగా లేవు. దీంతో బొప్పాయి సాగుపై మొగ్గు చూపిస్తున్నారు.

– చందిన శేషగిరి, బొప్పాయి రైతు, దొంకాడ

టమాటా ఎకరాకు రూ.లక్ష వరకు ఆదాయం

టమాటా పంటది కూడా అదే పరిస్థితి. ఎకరా విస్తీర్ణంలో డ్రిప్ సదుపాయం ఉంటే 6 వేల మొక్కలు నాటుతామని, మూడు నెలలకు దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. ఎకరాకు నెలకు రూ.500 కిలోల దిగుబడి, మూడు నెలలకు 1,800 కిలోల దిగుబడి వస్తుందంటున్నారు. టమాటాను కిలోల లెక్కన కాకుండా క్రేట్ (25 కిలోలు) లెక్కన అమ్ముతుంటారు. సీజన్‌లో డిమాండ్ ఎక్కువగా ఉన్న రోజుల్లో 25 కిలోల క్రేట్ గరిష్ఠంగా రూ.1500 పలికిందని, కనిష్ఠంగా రూ.300లకు కూడా విక్రయించామని టమాటా రైతులు చెబుతున్నారు. టమాటా ఎకరాకు రూ.లక్ష వరకు ఆదాయం తెచ్చిపెట్టిందని చెబుతున్నారు.



దొంకాడ పరిధిలో సాగుచేస్తున్న జామ

అపూర్వ కలయిక.. ఆత్మీయ పలకరింపు



పురుషోత్తపురం జెడ్పీ హైస్కూల్‌లో పూర్వ విద్యార్థులు



ఎస్.రాయవరంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

యలమంచిలి రూరల్: మండలంలోని పురుషోత్తపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1994–95 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు సందడి చేశారు. ఆదివారం ఇక్కడ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 30 ఏళ్ల తర్వాత అందరూ ఒకే వేదికపైకి వచ్చి గత స్మృతులను నెమరువేసుకున్నారు. ఉద్యోగ, వ్యాపారరీత్యా ఎక్కడెక్కడో స్థిరపడిన వాళ్లు కూడా దశాబ్దాల తర్వాత కలవడంతో ఒకరినొకరు ఆలింగనం చేసుకుని తన్మయత్వంలో మునిగి తేలారు. ఆనాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తోటి మిత్రులతో కలిసి సందడి చేశారు. ఎక్కడెక్కడో స్థిరపడిన తామంతా ఇక్కడ కలుసుకోవడం ఎంతగానో ఆనందాన్నిచ్చిందని పలువురు పూర్వ విద్యార్థులు తమ ఉపన్యాసాల్లో పేర్కొన్నారు. కార్యక్రమంలో కాళ్ల శ్రీనివాసరావు,బండారు గణేష్, రాజాన కొండలరావు,నకనబోయిన అప్పలరాజు,కాళ్ల స్వామినాయుడు,రుత్తల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: స్థానిక ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు ఆదివారం సందడి చేశారు. 1994–95 టెన్త్ బ్యాచ్‌కు చెందిన వీరంతా ఆత్మీయంగా కలుసుకున్నారు. ఉదయం నుంచి ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. చిలిపి చేష్టలతో నవ్వుస్తూ వారి క్షేమ సమాచారాన్ని తెలుసుకున్నారు. ఈ బ్యాచ్‌కు చెందిన మైత్రి ఫౌండేషన్ నుంచి అనారోగ్యంతో ఉన్నవారిని, ఆర్థికంగా ఇబ్బందులు పడే వారిని ఆదుకోవాలని తీర్మానించుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పి.లక్ష్మణరావు, ఎస్.జోగిరాజు, టి.సురేష్, పి.రాజా, బి.సతీష్, ఆడారు కమల తదితరులు పాల్గొన్నారు.



సమావేశమైన పూర్వ విద్యార్థులు

అచ్యుతాపురం రూరల్: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005–06 టెన్త్ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఉద్యోగ, వ్యాపార, రాజకీయం, తదితర రంగాల్లో స్థిరపడి నేడు కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందని వారంతా సంతోషం వ్యక్తం చేశారు. చిన్ననాటి విషయాలు గుర్తు చేసుకుని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత నేడు

ఎస్.రాయవరం: కొరుప్రోలు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో సోమవారం పలు గ్రామాలకు సరఫరా నిలిపివేస్తున్నట్లు అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. చెట్టుకొమ్మల తొలగింపు, మరమ్మతులు కారణంగా ఎస్.రాయవరం, బసవపాడు, లింగరాజుపాలెం, సర్వసిద్ధి, వేమగిరి, పేటసూదిపురం, వాకపాడు, జేవీపాలెం గ్రామాలకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.

స్పోర్ట్స్ సమ్మర్ క్యాంప్ ప్రారంభం



బాక్సింగ్‌లో శిక్షణ పొందుతున్న చిన్నారులు

నర్సీపట్నం: మున్సిపల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన సమ్మర్ స్పోర్ట్స్ క్యాంపును వెలగా నారాయణరావు, టూరిజం మేనేజర్ అప్పలనాయుడు ఆదివారం ప్రారంభించారు. సమ్మర్ క్యాంపునకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని నింజాస్ అకాడమీ ప్రతినిధులు తెలిపారు. పళ్లు, గుడ్లు, బిస్కట్లు, కేకులు, రాగిజావ అందజేస్తామని నారాయణరావు తెలిపారు. సీనియర్ కోచ్ మాట్లాడుతూ 40 రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. కరాటే, వుషు, బాక్సింగ్, వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, చెస్, యెగా వంటి క్రీడల్లో శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు.

బాలుడి ఆచూకీ లభ్యం

పెందుర్తి: పాఠశాల నుంచి ఇంటికి బయలుదేరి అదృశ్యమైన బాలుడి ఆచూకీని పెందుర్తి పోలీసులు 24 గంటల్లో కనుగొన్నారు. సుజాతనగర్లో ఉంటున్న బాలుడు(14) పాపయ్యరాజుపాలెంలోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. శనివారం ఉదయం పాఠశాలకు వెళ్లి, మధ్యాహ్నం సైకిల్‌పై ఇంటికి బయలుదేరాడు. సాయంత్రం ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. సీఐ కె.వి.సతీష్ కుమార్ ఆధ్వర్యంలో పెందుర్తి సమీపంలో గుర్తించి తల్లిదండ్రులను పిలిపించి అప్పగించారు.

సేవా కార్యక్రమాలతో ఎనలేని కీర్తి

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్



పాలకవర్గ సభ్యులను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

మునగపాక: గ్రామీణ యువజన మందిరం ద్వారా సేవా కార్యక్రమాలు చేపట్టి ఎనలేని కీర్తి పొందాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ కోరారు. నాటకాలకే పరిమితం కాకుండా ప్రజా ప్రయోజనాలకు అనువుగా ఉండేలా సేవలందించాలన్నారు. గ్రామీణ యువజన మందిరం నూతన పాలకవర్గ సభ్యులను ఆదివారం ఆయన సత్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ మునగపాక ఖ్యాతిని ఉభయరాష్ట్రాల్లో ఇనుమడింప చేసిన ఘనత గ్రామీణ యువజన మందిరానికే దక్కుతుందన్నారు. నాటకరంగ అభివృద్ధికి యువజన మందిరం కృషి అభినందనీయమన్నారు. నూతనంగా ఎన్నికైన పాలకవర్గం యువతకు, పిల్లలకు, గ్రామానికి ఉపయోగకరంగా ఉండేలా సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కళాకారులను మరింత ప్రోత్సహించాలన్నారు. యువజన మందిరం అధ్యక్షుడు ఆడారి శ్రీకాంత్, కార్యదర్శి ఆడారి సూరిబాబు, కోశాధికారి ఆడారి లక్ష్మణరావు, గౌరవాధ్యక్షుడు ఆడారి గంగమహేష్, ఉపాధ్యక్షుడు డాక్టర్ మళ్ల జోగారావు, మళ్ల రామజోగినాయుడు, విల్లూరి సోమునాయుడు, షేక్ నాగూర్, ఆడారి సోమశేఖర్, టెక్కలి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్



కోటవురట్లలో ఆత్మీయుల సమాధుల వద్ద స్మరించుకుంటున్న క్రైస్తవులు



కొరుప్రోలులో సమాధుల వద్ద ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

కోటవురట్ల: ఏసుక్రీస్తు పునరుత్థానాన్ని ఈస్టర్‌గా జరుపుకుంటారు. ఈ సందర్భంగా స్థానిక క్రీస్తు కృపాలయ బాప్టిస్టు చర్చి, బెతస్థా ప్రార్థనా మందిరం, ఎల్‌షద్దాయ్ ఆరాధన సంఘాలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసుక్రీస్తు బోధనలు వినిపించారు. ఈ సందర్భంగా తమ ఆత్మీయుల సమాధులను సందర్శించి ప్రార్థనలు చేశారు.

ఎస్.రాయవరం: ఈస్టర్ సందర్భంగా కుటుంబంలో చనిపోయిన పెద్దల సమాధులు వద్ద ప్రత్యేక అలంకరణ చేసి వారికి ఆత్మశాంతి చేకూరాలని క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కొరుప్రోలు, తిమ్మాపురం, పెదఉప్పలం, ఎస్.రాయవరం, దార్లపూడి, పెదగుమ్ములూరు, బంగారమ్మపాలెం తదితర గ్రామాల్లో ఈస్టర్ నిర్వహించారు.

ఖాళీ జాగా... వేసెయ్ పాగా!

- గెడ్డపోరంబోకులో అక్రమ నిర్మాణం
- చోద్యం చూస్తున్న అధికారులు



ప్రధాన జంక్షన్‌కు ఆనుకుని ఉన్న గెడ్డపోరంబోకు స్థలంలో వెలసిన అక్రమ నిర్మాణం

నర్సీపట్నం : మండలంలో వేములపూడి మేజర్ పంచాయతీలో స్థలాల విలువ పెరగడంతో ఖాళీ స్థలాలు కనబడితే పాక వేస్తున్నారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురువుతున్నా పంచాయతీ అధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. గ్రామ మెయిన్ రోడ్డులో సెంటు స్థలం రూ.15 లక్షల నుండి రూ.20 లక్షలు పలుకుతుంది. దీంతో ఖాళీ స్థలాలపై అక్రమార్కుల కన్ను పడింది. పంచాయతీ కార్యాలయానికి వెళ్లే రోడ్డు మార్గంలో ఉన్న సెంటున్నర గెడ్డపోరంబోకు స్థలాన్ని ఆ గ్రామానికి చెందిన వ్యక్తి అక్రమించి రేకుల షెడ్డు నిర్మించాడు. గతంలో షెడ్డు నిర్మాణానికి పాల్పడితే రెవెన్యూ అధికారులు నిలుపుదల చేశారు. కొన్ని నెలలు మిన్నకుండి ఈ రెండు, మూడు రోజుల్లో పోరంబోకు స్థలంలో పర్మనెంట్‌గా షెడ్డు నిర్మాణం జరిగిపోయింది. నిత్యం అదే మార్గంలో సచివాలయానికి వెళ్లే పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో చూసీచూడనట్టు వ్యవహరించడంతో ఆక్రమణదారు దర్జాగా నిర్మాణం చేశాడు. రెవెన్యూ, పంచాయతీ అధికారులు మేలుకోకపోతే గ్రామంలోని రూ.లక్షలు విలువ చేసే ప్రభుత్వ స్థలాలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని గ్రామస్తులు అంటున్నారు. ఈ విషయమై వీఆర్వో నవీన్‌ను సంప్రదించగా నిర్మాణం చేయవద్దని చెప్పినా రాత్రి వేళల్లో నిర్మాణం పూర్తి చేశాడని, ఆక్రమణ విషయాన్ని తహసీల్దార్ రామారావు దృష్టికి తీసువెళ్లామన్నారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు సోమవారం డిస్మాంటిల్ చేస్తామని వీఆర్వో తెలిపారు. పంచాయతీ పరిధిలో ఉన్నందున తాము కూడా నిర్మాణదారుకు నోటీసు ఇస్తామని ఈవో సత్యనారాయణ తెలిపారు.

ప్రేమ సమాజంలో అదనపు సౌకర్యాలు

చోడవరం: స్థానిక ప్రేమ సమాజంలో మరిన్ని సదుపాయాలు సమకూర్చారు. అనాథలైన వృద్ధులు, వికలాంగులు, విద్యార్థులు ఇక్కడ ఆశ్రయం పొందుతున్నారు. సోలార్ యూనిట్, 20 బెడ్లు, కొత్తగా మరో భవనం, ఫిల్టర్ వాటర్ యూనిట్, వికలాంగులకు ధర్మసత్రం, గ్రంథాలయం, గంజి కేంద్రాలను ఇప్పుడు ఏర్పాటు చేశారు. వీటిని ఎమ్మెల్యే కే.ఎస్ఎన్ఎస్ రాజు, విశాఖ ప్రేమసమాజం చైర్మన్ బుద్ధ శివాజీ, చోడవరం ప్రేమసమాజం అభివృద్ధి కమిటీ చైర్మన్ పూసర్ల రామారావు ప్రారంభించారు. అప్పటి కలెక్టర్ అర్జునరావు స్థలసేకరణతో ఇప్పుడు అందరికీ అందుబాటులో ఉందన్నారు.

ఆలయానికి పంచలోహ ఇత్తడి తొడుగు అందజేత



సర్పంచ్ సంజీవరావుకు ఇత్తడి తొడుగు అందజేస్తున్న దాతలు

మాడుగుల రూరల్: మండలంలో ఎం. కోడూరు గ్రామ ఆరాధ్య దైవం మోదమాంబ ఆలయానికి దాతలు 50 కిలోల పంచలోహ ఇత్తడి తొడుగును సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు ద్వారా ఆదివారం అందజేశారు. ఎం. కోడూరు గ్రామానికి చెందిన ముమ్మిన అప్పారావు సోదరులు, వారి కుమారులు, కాకర అప్పారావు కుటుంబ సభ్యులు, సోమిరెడ్డి అప్పారావు కుటుంబ సభ్యులతో పాటు స్థానిక ఎంపీటీసీ సభ్యుడు ముమ్మిన రమణబాబు, పార్వతి దంపతుల ఆర్థిక సహకారంతో 50 కిలోల ఇత్తడితో తయారు చేసిన తొడుగును అందజేశారు. దీని విలువ రూ. 80 వేలు ఉంటుదని దాతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసశర్మ, పడాల అప్పలనాయుడు, ఎస్. సముద్రం, కలిమి గోపాల్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.